క్లుప్తంగా

నర్సరీ పరిశీలన

మానవపాడు: మండల కేంద్రంలోని నర్సరీని శనివారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలో సమస్యలపై సిబ్బందితో చర్చించారు. నర్సరీలలో ఎండకాలం కావడంతో నీటి వసతిని ఎప్పటికప్పుడు అందించాలని సూచించారు. నర్సరీలోని మొక్కలకు ఎండతీవ్రత తగులకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు ఉన్నారు.

స్వతంత్ర అభ్యర్థి ఎన్నికల ప్రచారం

అయిజ: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్వతంత్ర అభ్యర్థి పాలాది నాగరాజు మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజకీయ పార్టీల అభ్యర్థులను గెలిపిస్తే పార్టీ అధిష్ఠానం చెప్పినట్లు నడుచుకోవాలని, అభివృద్ధికోసం స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన తనను గెలిపించాలని కోరారు.

చిల్డ్రన్ సమ్మర్ క్యాంప్



అయిజ: యూత్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో మండల పరిషత్ ప్రైమరీ స్కూల్లో చిల్డ్రన్ సమ్మర్ క్యాంప్ నిర్వహించారు. విద్యార్థులతో యోగా క్లాసులు ప్రారంభించారు. ఈసందర్భంగా యూత్ ఫౌండేషన్ సభ్యులు మాట్లాడారు. వేసవిలో విద్యార్థులు సరదాగా ఈత కొట్టేందుకు బావులకు, చెరువులకు వెళ్లి ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారని వాపోయారు. వారిని నివారించేందుకు సమ్మర్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వృథాగా చెత్త సేకరణ రిక్షాలు



ఉండవెల్లి: మండలంలో చెత్త బండ్లు రిపేరుకు వచ్చి వాటిని పట్టించుకోవడం లేదని ప్రజలు పేర్కొంటున్నారు. పంచాయతీ కార్మికులు చెత్త రిక్షాలను రిపేరుకు వచ్చాక వాటిని మరమ్మతులు చేయిస్తామని చెప్పి మూలకు పడేస్తున్నారు. తక్కశిలలో రిక్షాలను మురికి కాల్వ వద్ద పడేశారు. పందులు, రిక్షాలు అక్కడే ఉండడంతో ప్రజలు ఆరోగ్య ఉప కేంద్రానికి రాలేక ఇబ్బందులు పడుతున్నారు. వాటిని మరమ్మతులు చేయించి, ఉపయోగించి గ్రామంలో చెత్తను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వేసవి యోగా శిబిరం ప్రారంభం



వనపర్తి టౌన్: వేసవి యోగా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా యువజన క్రీడాల అధికారి సుధీర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం జిల్లా యోగాసన క్రీడా సంఘం ఆధ్వర్యంలో వేసవి యోగా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి క్రమం తప్పకుండా యోగా సాధన చేయాలని, అభ్యాసం మెదడుకు పదును పెట్టి కొత్తకొత్త ఆలోచనలు ఇచ్చేందుకు దోహదపడుతుందన్నారు. యోగాతో మంచి క్రమశిక్షణతో కూడిన జీవనశైలిని అలవాటు పడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుగుణ, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రేమలత, గణేష్, గోవింద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత చదువుల్లో రాణించాలి

అమరచింత: పదో తరగతిలో 9.8 జీపీఏ సాధించిన విద్యార్థిని నుజాహత్‌ను శనివారం టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ శాలువాతో సన్మానించారు. ఈమేరకు ఆయన మాట్లాడుతూ విద్యలో రాణించి అనుకున్న లక్ష్యాన్ని సాధించి తన తల్లిదండ్రులతో పాటు పట్టణానికి మంచి పేరు, ప్రతిష్ఠతలు తీసుకు రావాలన్నారు.

ప్రైవేట్‌కే రైతుల మొగ్గు..!

- ధాన్యం కొనుగోలు కేంద్రాలకు దూరం
- ప్రభుత్వ తీరుతో విసిగిన రైతులు
- ప్రైవేట్ వ్యాపారులకు అమ్మేందుకు ఆసక్తి
- ఎండలు, ధరలో తేడాలే కారణాలు

రాజోళి: మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా మారింది రైతు పరిస్థితి. అసలే సరైన వర్షాలు లేక వానాకాలం సీజన్ మొత్తంలో సాగు చేసిన పంటలు చేతికి రాక నష్టం చవిచూసిన రైతులకు, యాసంగి సీజన్‌లో నానా తంటాలు పడి పండించిన పంటను కొనే దిక్కు లేక మళ్లీ నష్టాల బాటలోనే కొనసాగుతోంది. నియోజకవర్గంలో వానాకాలం సీజన్‌లో సాగు చేసిన పత్తి ఇతర వాణిజ్య పంటలకు లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి నష్టపోయినా, అనంతరం తుంగభద్ర నది పరివాహక గ్రామాల్లో వాగులు, వంకలు, బోర్ల నీటి వసతి ఉన్న చోట పండించిన వరిలో చుక్కెదురైంది. పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులకు సరైన మార్కెట్ ధర లభించక, ప్రభుత్వ తోడ్పాటు లేక ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకుంటున్నారు.

కొనుగోలు కేంద్రంపై నమ్మకం లేకనే..

ప్రభుత్వం తరఫున ధాన్యం కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తారని అనుకున్న రైతులకు నిరాశే ఎదురైంది. జనవరిలో నాట్లు వేసి, వరి పంట సాగు చేసిన రైతులు వాగుల్లో నీరు లేకపోయినా, బోర్లలో నీరు ఇంకిపోతున్నా, నానా తంటాలు పడి పంట పండించారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యం కొనుగోలు చేస్తుందని ఆశపడ్డారు. కానీ పంట చేతికొచ్చి, వరి కుప్పలు పోసి నెల రోజులు గడిచినా, కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. దీంతో అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్పటికే కేంద్రం ఏర్పాటు చేసి ఉంటే ప్రైవేట్ వ్యాపారుల కన్నా కొంత ధర తక్కువైనా ప్రభుత్వానికే ధాన్యం అమ్మేవాళ్లమని రైతులు అంటున్నారు. ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారులు 75 కేజీల వరి బస్తా



మాన్‌దొడ్డిలో ప్రైవేట్ వ్యాపారులకు వరి కాంట పడుతున్న రైతులు



అమ్మేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం

రూ.1750లకు కొంటున్నారు. మండలంలో గతంలో కొనుగోలు చేసిన కేంద్రాల్లోనే మళ్లీ ధాన్యం కొంటామని సంబంధిత అధికారులు చెప్పడమే తప్పా, వాటిని తెరిచి రైతులను చైతన్య పరిచిన వారు లేరని రైతులు పేర్కొంటున్నారు.

వరి విక్రయానికి కారణాలెన్నో..

రైతులు ఇన్ని రోజులు ఎదురుచూసి ప్రస్తుతం ప్రైవేట్ వ్యాపారులకు వరి అమ్ముకునేందుకు చాలా కారణాలు ఉన్నాయి. ప్రస్తుతం ధాన్యం బయట కుప్పలు పోసి ఉంచారు, ఎండ తీవ్రత పెరిగి ధాన్యం వట్టిగా అయిపోతోంది. అకాల వర్షాలు కురిస్తే మొత్తం తడిసిపోయే ప్రమాదముంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉన్నందున అధికారులు పలు కారణాలు చెప్పడం, కొనుగోలు కేంద్రంలో రైతులకు సరైన ధర ఇచ్చి ధాన్యం కొనుగోలు చేసే అవకాశాలు తక్కువగా కనిపించాయి. దీంతో పాటు ప్రకృతి వైపరీత్యాల కారణంగా మళ్లీ నష్టం చవిచూసే ధైర్యం లేక ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. వ్యాపారులు నేరుగా వ్యాపారుల వద్దకు వెళ్లి కొనుగోలు చేసి లారీల్లో తీసుకెళ్తున్నారు. జొన్నల కొనుగోళ్లలో కూడా ప్రభుత్వం కేంద్రాన్ని ఆలస్యంగా ప్రారంభించింది. దీని వల్ల చాలా మంది రైతులు వ్యాపారులకు అమ్ముకున్నారు.

కేంద్రాల సంగతే మరిచారు..

గతంలో రాజోళి మండలంలో రాజోళి, పచ్చర్ల, మాన్‌దొడ్డి, పెద్ద ధన్వాడ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆ విషయం ఇప్పటిదాకా చాలా మంది రైతులకు తెలియదు. అక్కడ ఇచ్చే ధర, అక్కడ ధాన్యం కొనుగోలు చేసే అధికారులు ఎవరో కూడా గ్రామాల్లో రైతులకు సమాచారం లేదు. గ్రామాల్లో రైతు వేదికల్లోనే కేంద్రాలు ఏర్పాటు చేస్తారని, పక్కనే రైతులు వరి కుప్పలు పోసుకుని రోజులు గడుస్తున్నా, అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు.

ఏప్రిల్ 3న కేంద్రం ప్రారంభించాం..

సివిల్ సప్‌లై తరఫున ఏప్రిల్ 3న గతంలో ఉన్న కేంద్రాల్లోనే వరి కొనుగోలు కేంద్రం ప్రారంభించాం. రైతులు ఎవరూ ధాన్యం అమ్మేందుకు ముందుకు రావడం లేదు. రైతులు వరి అమ్మేందుకు సిద్ధంగా ఉంటే ధాన్యం కొంటాం

– గోపాల్‌రెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు

ఇప్పటికే ఏర్పాటు చేయాల్సి ఉంది



ఏప్రిల్ మొదటి వారంలోనే ధాన్యం రైతుల చెంతకు చేరింది. అమ్ముకునేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదు. పంట చేతికొచ్చి నెల రోజులు గడుస్తున్నా ఇంతవరకు కేంద్రం ఏర్పాటు చేయకపోతే పెట్టుబడులకు వడ్డీలు పెరుగుతున్నాయి. అందుకే వ్యాపారులకు అమ్మి అప్పులు కట్టుకుంటున్నాం. ఈ సమయానికే ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ఉంటే రైతులు కేంద్రంలో వరి ధాన్యం అమ్మేవాళ్లం.

– కృష్ణమోహన్ ఆచారి, రైతు, మాన్‌దొడ్డి

ప్రకృతి వైపరీత్యాల భయం..



ప్రస్తుతం ధాన్యం కల్లాల్లో ఉంచుకుని నెల రోజులైంది. నేటి వరకు ప్రభుత్వం నుంచి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటన కూడా లేదు. ఎండలకు ధాన్యం మొత్తం వట్టిగా మారుతోంది. ఎక్కువ రోజులు ఆగితే తేమశాతం లేదని ధర తగ్గిస్తారు. అకాల వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో ధాన్యం తడిసిపోతే మొత్తానికే నష్టపోవాల్సి వస్తుంది.

– చంద్రశేఖర్, రైతు, మాన్‌దొడ్డి

ఆయుష్మాన్ కార్డులకు లింక్ తప్పనిసరి



క్యాతూర్ పీహెచ్‌సీలో సమావేశంలో పాల్గొన్న అధికారులు

అలంపూర్ రూరల్: ప్రతిరోజు ఎన్‌సీడీ ఫాలోఅప్‌తో పాటు ఆయుష్మాన్ భారత్ కార్డులు లింక్ చేసి ఎన్‌సీడీ సూపర్ వైజర్‌కు తెలపాలని ప్రోగ్రాం అధికారి డాక్టర్ రాజు అన్నారు. మండల పరిధిలోని క్యాతూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆబా లింకింగ్, ఎన్‌సీడీపై మండల వైద్యాధికారిని డాక్టర్ ప్రసూనరాణి ఆధ్వర్యంలో వైద్య సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్, సిబ్బంది, సూపర్‌వైజర్లకు ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్స్ లింకింగ్‌కు సంబంధించిన వివరాలను ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రసూనరాణి, ఎన్‌సీజీ కో ఆర్డినేటర్ శ్యాంసుందర్, సీహెచ్‌ఓ లక్ష్మీకాంతం, డాక్టర్ ప్రతిభస్ఫూర్తి, రామస్వామి, శివకుమార్, సూపర్‌వైజర్ అక్కమ్మ, హెచ్‌ఏ బాలీశ్వరయ్య శెట్టి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పండ్ల పంపిణీ



అయిజ: భారతీయ జనతాపార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ జన్మదినం సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

బీఆర్‌ఎస్ అభ్యర్థిని ఆశీర్వదించండి

- ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

అలంపూర్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు కోరారు. అలంపూర్ పట్టణంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో అలంపూర్ మండల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. గతేడాది డిశంబర్ 9న రైతులకు రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చినా ఇప్పటికి కనీసం రైతుబంధు ఖాతాల్లో జమ చేయలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి లబ్ధి పొందడానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామని దేవుళ్లపై ఒట్టు వేసి మరోసారి మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. కేసీఆర్ సారథ్యంలో బంగారు తెలంగాణ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీనివాసుడి కల్యాణం



ఉండవెల్లిలో కళ్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



శ్రీదేవి, భూదేవి, శ్రీనివాసులకు పుష్పలంకరణ

ఉండవెల్లి: మండల కేంద్రంలోని శనివారం శ్రీనివాసుడి నామస్మరణ మార్మోగింది. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసకల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం ఇతర పూజలు నిర్వహించారు. భక్తులు శ్రీనివాసుడి కల్యాణంలో పాల్గొన్ని మొక్కులు తీర్చుకున్నారు. రఘురామయ్య శెట్టి కుటుంబ సభ్యులు మురళి కృష్ణ, దీపిక, నవీన్, అనితా దంపతులు సమక్షంలో కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు బాలీశ్వరశెట్టి, రాములయ్య, సూర్య ప్రకాష్ శెట్టి, లక్ష్మణ్, సతీష్, కొత్త రమేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బలరాంనగర్ కాలనీలో నీటి కష్టాలు



బలరాంనగర్ నుంచి బిందెలతో నీటికోసం రోడ్డుపై కలుకుంట్లకు వెళ్తున్న కాలనీవాసులు

- హైవేపై బిందెలతో ప్రజల బారులు

మానవపాడు: మండలంలోని మద్దూరు గ్రామంలోని రెండు కిలోమీటర్ల దూరంలో అంతర్జాతీయ రహదారి పక్కనే బలరాంనగర్ కాలనీ ఉంది. ఈ చిన్న కాలనీలో ఆరు నివాస గృహాలు, 50 మంది నివాసముంటున్నారు. శనివారం నీటి కోసం మహిళలు, చిన్నారులు అంతర్జాతీయ రోడ్డుపై బిందెలతో బారులు కట్టారు. ఇంతవరకు కాలనీ వాసులకు మిషన్‌భగీరథ పైప్‌లైన్ ఇవ్వలేదు. గతంలో మద్దూరు గ్రామ పంచాయతీలో నీటివసతి కల్పించాలని దరఖాస్తులు ఇచ్చినా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోలేదు. గత కొన్ని రోజులుగా నీటి కష్టాలు అధికమయ్యాయి. కాలనీలో చేతిపంపు మరమ్మతులకు గురైంది. బలరామ్‌నగర్ నుంచి మద్దూరు, కలుకుంట్ల గ్రామాలకు వాహనాల మీద వెళ్లి నీటిని తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. ఇంట్లో భర్తలు ఇతర పనులకు వెళ్లే సమయంలో మహిళలు నీటి కోసం నడిరోడ్డుపై ఎండలో బిందె లు తీసుకోని కలుకుంట్ల, మద్దూరు గ్రామాలకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నారు. వేసవికాలం కావడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నీటి వసతిని ఏర్పాటు చేయాలని బలరామ్‌నగర్ కాలనీ వాసులు కోరుతున్నారు.

నేడు బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశం

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ, మండల బీఆర్‌ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు మహిపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక భవాని ఫంక్షన్‌హాల్లో ఉదయం 10:30 గంటలకు కార్యక్రమం ఉంటుందన్నారు. సమావేశానికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు హాజరవుతారని, ఆయా గ్రామాల్లోని ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, సింగిల్‌విండో డైరెక్టర్లు, వార్డు సభ్యులు, బీఆర్‌ఎస్ మండల, గ్రామస్థాయి అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎయిడ్స్‌పై అవగాహన అవసరం



గద్వాల అర్బన్: ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఎయిడ్స్ వ్యాధి గురించి తెలుసుకోవాలన్నారు. సమాజంలోని నిరాక్షరాస్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా 'ఎయిడ్స్ నిర్మూలన – చర్యలు, రక్తదానంతో కలిగే లాభాలు' అనే అంశంపై ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రెడ్ రిబ్బన్ కన్వీనర్ జగన్ మోహన్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

కాంగ్రెస్‌కు సీపీఎం మద్దతు



శాంతినగర్: ఇండియా కూటమిలో భాగమైన కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇస్తున్నట్లు సీపీఎం నాయకులు ప్రకటించారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్ కాంగ్రెస్‌పార్టీ క్యాంపు కార్యాలయంలో శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, సీపీఎం నాయకులు సమావేశమయ్యారు. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌ను కలిసి సీపీఎం జిల్లా నాయకులు వెంకటస్వామి, పరంజ్యోతి, భీమన్న మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డా.మల్లు రవిని గెలిపించేందుకు తమవంతు కృషి చేస్తామని ఏఐసీసీ కార్యదర్శికి హామీ ఇచ్చారు. సమావేశంలో షేక్షావలి ఆచారి, ఎంపీ అభ్యర్థి తనయుడు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సత్తా చాటిన నంద్యాల ఎద్దులు



బల్గెరలో నిర్వహిస్తున్న బండలాగుడు పోటీలు

గట్టు: దిగంబరస్వామి ఉత్సవాల సందర్భంగా బల్గెరలో నిర్వహించిన బండలాడుగు పోటీల్లో నంద్యాల జిల్లాకు చెందిన ఎద్దులు సత్తాను చాటి మొదటి బహుమతి గెలుచుకున్నాయి. బల్గెరలో నిర్వహిస్తున్న దిగంబరస్వామి జాతర సందర్భంగా బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ ప్రాంతాలకు చెందిన మొత్తం 8 జతల ఎద్దులు పోటీలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. బండలాగుడు పోటీల్లో నంద్యాల జిల్లాకు చెందిన నాగయ్య ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ. 50 వేలు దక్కించుకున్నాయి. ద్వితీయ బహుమతి రూ.40 వేలు నాగర్‌కర్నూలు జిల్లాకు చెందిన అఖిలాష్‌రెడ్డి దక్కించుకున్నారు. తృతీయ బహుమతి రూ.30 వేలు కంచుపాడుకు చెందిన సుధాకర్ ఎద్దులు దక్కించుకోగా, నాలుగో బహుమతి రూ.20 వేలు వర్కూర్‌కు చెందిన దొడ్డి కోటి తిరుమలేష్ ఎద్దులు దక్కించుకున్నారు. ఐదో బహుమతి రూ.10 వేలను సందికోనకు చెందిన ఉప్పరి సుందరప్ప ఎద్దులు దక్కించుకున్నాయి. విజేతలకు జెడ్పీటీసీ బాసు శ్యామల, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు హనుమంతునాయుడు, ఎంపీటీసీ రూపవతి నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మొగిలి హనుమంతు, గద్వాల తిమ్మప్ప, రాము, గోవిందు, లక్ష్మన్న, బస్సప్ప, రాజునాయుడు, జ్ఞానేశ్వర్, బాసు నాయుడు, లోకేష్, గోపాల్ పాల్గొన్నారు.

హామీల అమలులో బీజేపీ విఫలం



గట్టులో బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

గట్టు: ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బీజేపీ వద్దని, కాంగ్రెస్ కూటమిని గెలిపించాలని సీపీఎం నాయకులు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. శనివారం మండల కేంద్రంలో సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి వీవీ నర్సింహ, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మారెన్నలు బుక్‌లెట్ విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు, రైతుల ఆదాయం రెట్టింపు, మహిళలపై దాడులను అరికడతామని చెప్పి, ఏ ఒక్కటీ అమలు చేయలేదని పేర్కొన్నారు. ధరలు తగ్గిస్తామని, అవినీతిని నిర్మూలిస్తామని చెప్పిన మాటలను గాలికి వదిలేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ కూటమి అభ్యర్థి మల్లురవిని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకురాలు నర్మద, కర్రెప్ప, స్వామి, గోవిందు, వెంకటేష్, భీముడు, నర్సింహ, తిమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో సాయుధ బలగాలు



శాంతినగర్‌లో ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న సాయుధ బలగాలు, శాంతినగర్ పోలీసులు

శాంతినగర్: ఈనెల 13న నిర్వహించనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు నిర్భయంగా ఓటు వేసేందుకు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర సాయుధ బలగాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్ తెలిపారు. వడ్డేపల్లి మండలంలోని కొంకల, మున్సిపాలిటీ పరిధిలోని వడ్డేపల్లి, శాంతినగర్‌లో శనివారం ఏటీబీపీ బలగాలు, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సంతోష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పోలీస్‌శాఖ కృషి చేస్తుందని, ప్రజలందరికి పోలీసులు ఎల్లవేళలా తోడుంటారన్నారు. ధైర్యాన్ని కల్పించడానికే ఫ్లాగ్‌మార్చ్ కార్యక్రమం చేపట్టినట్లు వివరించారు. ఎన్నికల సమయంలో కేంద్ర బలగాలు కీలకపాత్ర పోషిస్తాయని, ప్రతి సమస్యాత్మక పోలింగ్ కేంద్రం వద్ద సాయుధ బలగాలతో కూడిన ఐటీబీపీ సిబ్బంది విధులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో ఐటీబీపీ ఇన్‌స్పెక్టర్ కైలాస్‌రామ్, శాంతినగర్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగస్టు 15లోగా రుణమాఫీ

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి



ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి మల్లు రవి

గద్వాల అర్బన్: ఆగస్టు 15లోగా రైతులకు రుణమాఫీ చేస్తామని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ సరిత, ఎంపీ అభ్యర్థి మల్లు రవి గద్వాల మండలంలోని అనంతపురం, పూడూరు, ఎర్రవల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 200యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ హామీలను నెరవేర్చిందని, ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా ఈ పథకాలు అమలుకు నోచుకోలేదన్నారు. ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో తనను ఆశీర్వాదించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఆదివారం ఎర్రవల్లిలో బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభకు రాహుల్ గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డి హాజరు అవుతున్నట్లు ఆయన తెలిపారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

చిల్లర వసూళ్లతో చిరు వ్యాపారుల బెంబేలు

శాంతినగర్: రోడ్లపై పండ్లు, పూలు, కొబ్బరి బొండాలు, జ్యూస్‌లు, కూరగాయలు అమ్ముకునే చిరువ్యాపారులతో మున్సిపల్ అధికారులు చిల్లర వసూళ్లకు పాల్పడుతుండటంతో బెంబేలెత్తిపోతున్నారు. వడ్డేపల్లి పురపాలిక పరిధిలోని శాంతినగర్‌లో తోపుడు బండ్లు, రోడ్లకు ఇరువైపుల చిరు వ్యాపారులు వ్యాపారం చేసుకుంటూ కుటుంబాలు పోషించుకుని జీవనం సాగిస్తున్నారు. బండ్ల మీద వ్యాపారం చేసుకుని బతుకుతున్న నిరుపేదలతో సైతం వసూళ్లకు పాల్పడుతు పొట్టకొడుతున్నారని ఆవేదన చెందుతున్నారు. చిన్న వ్యాపారులతో ప్రతి రోజు రూ.50 నుంచి రూ.100 వసూలు చేస్తున్నారని, గట్టిగా అడిగిన వారికి రశీదు ఇస్తారని, అడగని వారి డబ్బులు జేబుల్లోకి తోసుకుంటున్నారని పలువురు పేర్కొంటున్నారు. చిల్లర రశీదుపై కమిషనర్ డిజిటల్ సంతకం ఉండటం గమనార్హమని వాపోతున్నారు. తెలంగాణలోని అన్ని మున్సిపాలిటీ కేంద్రాల్లో ఓ పద్ధతి ఉంటే వడ్డేపల్లి మున్సిపాలిటీలో అందుకు భిన్నంగా ఉందని పేర్కొంటున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్, ఉన్నతాధికారులు స్పందించి అక్రమంగా వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు.

మేడే రోజు ఓ చిరువ్యాపారితో వసూలు చేసిన డబ్బులకు సంబంధించిన రశీదు



బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

రాజోళి: మండలంలోని ముండ్లదిన్నె గ్రామానికి చెందిన పెద్దింటి చిన్న తిమ్మరాజు(70) కుటుంబానికి అండగా ఉంటామని అలంపూర్ మాజీ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శుక్రవారం రాత్రి అనారోగ్యంతో తిమ్మరాజు మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ సుగుణమ్మ, వడ్డేపల్లి వైస్ ఎంపీపీ చంద్రగౌడ్, మాజీ జెడ్పీటీసీ వడ్డేపల్లి శ్రీనువాసులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దస్తగిరి, భాస్కర్, గోపి, మూగెన్న, వెంకట్రాముడు ఉన్నారు.